క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకుల సమావేశం మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు కార్యాలయ ప్రతినిధి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9.00 గంటలకు కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై పుస్తకావిష్కరణ జరుగుతుందన్నారు. మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తప్పక హాజరు కావాలని కోరారు.

మొక్కుబడిగా మీకోసం

సింగరాయకొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహిస్తున్న మీకోసం మొక్కుబడిగా సాగుతోంది. సోమవారం రెండు అర్జీలు రాగా కేవలం ముగ్గురు అధికారులు మాత్రమే పాల్గొన్నారు. చెంచుకాలనీ వాసులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి స్థల వివాదం పరిష్కరించాలని అర్జీలు ఇచ్చారు. తహసీల్దార్ టి.రవి, ఈఓఆర్‌డీ ఆర్ రమేష్‌బాబు, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి మాత్రమే పాల్గొన్నారు. అన్ని శాఖల అధికారులు కార్యక్రమానికి రావాల్సి ఉన్నా అధికారులు ఎవ్వరూ రావటం లేదని, ఏదో మొక్కుబడిగా మాత్రమే వస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అధికారులంతా అందుబాటులో ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మోదీ పాలనలో దేశ సమగ్ర ప్రగతి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా నాయకులు

కనిగిరిరూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశం ఆర్థికంగా బలపడిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు అన్నారు. కనిగిరిలో సోమవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అనంతరం మొక్కలు నాటారు. బీజేపీ నాయకులు పీవీ శివారెడ్డి, నరాల శ్రీనివాసులరెడ్డి, కొండ శెట్టి రమణయ్య, నారాయణ, వెంకట్, ముక్కు వెంకట రెడ్డి, నవీన్, నరసింహులు, త్రిమూర్తులు, గోప్స్, మాలకొండయ్య, సత్యం పాల్గొన్నారు

పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కనిగిరిరూరల్: పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డివిజన్‌లోని వివిధ సర్కిల్, పోలీస్‌స్టేషన్ల పోలీస్ అధికారులతో సోమవారంనేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సర్కిల్, స్టేషన్‌ల వారీగా కేసుల పురోగతిపై సమీక్ష చేశారు. సత్వర కేసుల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ ఖాజావలి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలలో పోషకాలు ఎక్కువ

కందుకూరు రూరల్: చిరుధాన్యాలలో పోషకాలు అధికంగా ఉంటాయని కళాశాల అసోసియేట్ డీన్ వీ విజయభాస్కర్ అన్నారు. మండలంలోని ఓగూరు గ్రామం వద్ద ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో ఓగూరు గ్రామంలో మహిళా రైతులకు చిరుధాన్యాల విలువను పెంచే ఆహార పదార్థాల తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ చిరుధాన్యాలు వాతావరణ వైఫల్యాలను తట్టుకోవడం, చీడ పీడలకు లొంగని సామర్థ్యం అన్నింటికి మంచి పోషక గనులు ఉన్నాయన్నారు. ఆరోగ్యమే మహా భాగ్యమంటూ చిరుధాన్యాలను తమ ఆహార మెనులో చేర్చుకోవడానికి ఇష్టపడుతున్నారని తెలిపారు. కరోనా పుణ్యమా అని చాలా మంది ప్రజలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరిగిందన్నారు. చిరుధాన్యాలతో మన శరీరానికి కావాల్సిన పోషకాలు పుష్కలంగా ఉంటాయన్నారు. ప్రోటీన్, ఫైబర్, మినరల్స్, బీ6 వంటి పోషకాలు మెండుగా ఉంటాయని తెలిపారు. చిరుధాన్యాల్లో ఐరన్ ఎక్కువగా ఉంటాయన్నారు భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థానం ప్రప్రథమంగా చిరుధాన్యాల యాజమాన్య పద్ధతులు, ప్రాసెసింగ్, చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులను అభివృద్ధి చేశారన్నారు. ప్రజలలో చిరుధన్యాల పట్ల అవగాహన కల్పించడానికి ఉపప్రణాళిక ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. షెడ్యూల్ కుల రైతుల సాధికారత పథకం 2024–25 కింద షెడ్యూల్ కుల రైతులకు ఉచితంగా చిరుధాన్యాలను ఉపయోగించి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ చేస్తారన్నారు. కార్యక్రమంలో సహాయ అధ్యాపకులు ఎం.సంఘమిత్ర, కె.సాయి మనోజ్ఞ, ఎం.పవిత్ర, వీహెచ్‌ఏ కె.శరత్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం..

- గుంతలమయంగా గ్రామీణ రోడ్లు
- వర్షాలు కురిస్తే ప్రయాణం నరకప్రాయమే
- కనీస మరమ్మతులు కూడా కరువే
- మంత్రి స్వామి సొంత మండలంలోనే అధ్వానంగా రహదారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



గుంతలమయంగా పెళ్లూరు - వాసేపల్లిపాడు రోడ్డు



టంగుటూరు - అలకూరపాడు మధ్య ప్రమాదకరంగా గుంతలు



మర్లపాడు బస్టాండ్ నుండి ఒంగోలు వెళ్లే కొండల వద్ద రోడ్డులో గుంతలు

టంగుటూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా రహదారుల దుస్థితి మాత్రం మారలేదు. సంక్రాంతి నాటికి రోడ్లన్నింటినీ అద్దాల్లా మారుస్తామంటూ గొప్పగా మాటలు చెప్పిన ప్రభుత్వం అమల్లో మాత్రం చేతులెత్తేసింది. ఫలితంగా గ్రామీణ రహదారులు కనీస మరమ్మతులకు నోచుకోక ప్రజలకు నరకం చూపిస్తున్నాయి. ఇటీవల అడపా దడపా కురుస్తున్న వర్షాలకు రోడ్లు దెబ్బతిని ప్రయాణానికి ఇబ్బందికరంగా మారాయి. కానీ ప్రజాప్రతినిధులు గానీ అధికారులు గానీ ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. మంత్రి స్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని సొంత మండలంలో గ్రామాల్లో రోడ్లు దయనీయ పరిస్థితుల్లో ఉన్నాయి.

టంగుటూరు – వెలగపూడి, అనంతవరం, అలకూరపాడు, కె. ఉప్పలపాడు – ఎం. నిడమానూరు, పెళ్లూరు – వాసేపల్లిపాడు, కొండపి ఫ్లైఓవరు నుంచి బొమ్మల సెంటరు వరకు, కొణిజేడు – మర్లపాడు, మర్లపాడు గ్రామంలో బస్టాండ్ సెంటర్ నుంచి హైస్కూల్, కొండల మీదుగా ఒంగోలు వెళ్లే పంచాయతీ పరిధిలోని మెటల్ రోడ్డు గుంతలతో రోడ్డు..ఇలా మండలంలో చాలా రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఈ రోడ్లకు కనీస మరమ్మతులు కూడా చేయకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. వర్షాకాలం సమీపిస్తుండటంతో గుంతల రోడ్లలో ప్రయాణం ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.

తూతూమంత్రంగా మరమ్మతులు

రోడ్లు అధ్వానంగా మారి గుంటలతో ప్రజలు, వాహనదారులు రోడ్డుపైకి రావాలంటే బయపడుతుంటే ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్ల మరమ్మతుల పేరుతో అక్కడక్కడ డస్టుతో గుంతలు పూడ్చి అధికారులు జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రోడ్లు అధ్వానంగా ఉండటంతో ఎక్కువ శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

గుంతల రోడ్డుతో తరచూ ప్రమాదాలు



గ్రామీణ రోడ్లు గుంతల పడి ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. కొండపి ఫ్లైఓవరు నుంచి టంగుటూరు సెంటరు వరకు, ఆలకోరపాడు రోడ్డులో వర్షానికి గుంతల్లో నీరు చేరి రోజూ ద్విచక్రవాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి రోడ్లకు మరమ్మతులు చేయాలి.

– బెజవాడ జగదీష్, టంగుటూరు

210 బేళ్లు తిరస్కరణ



టంగుటూరులో వేలం

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి జి. సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని మూగచింతల, గుర్రప్పడియ, నెన్నూరుపాడు, చతుకుపాడు, కె.అగ్రహారం గ్రామాలకు చెందిన రైతులు 936 బేళ్లు వేలానికి తీసుకురాగా 726 బేళ్లను కొనుగోలు చేశారు. వ్యాపారులు వివిధ కారణాలతో 210 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.180, సరాసరి ధర రూ.246గా నమోదైంది. వేలంలో 18 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో సోమవారం నిర్వహించిన వేలంలో 218 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. జమ్ములపాలెం, తుమాడు గ్రామాలకి చెందిన రైతులు 808 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 590 బేళ్లను కొనుగోలు చేసి 218 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.180, సరాసరి ధర రూ.242.32 పలికింది. వేలంలో 23 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన ప్రజాపోరాట సమితి నాయకుల

సింగరాయకొండ: మండల కేంద్రంలోని కనుమళ్ల రోడ్డులో ఉన్న తారకరామ కాలనీకి చెందిన చెంచు గిరిజనులకు నివేశన స్థలాలు ఇవ్వాలని గిరిజన ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పేరం సత్యన్నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం ఆవరణలో సోమవారం చెంచు గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా నిర్వహించారు. తరువాత మీకోసం కార్యక్రమంలో తహశీల్దార్ టి.రవిని కలిసి వినతిపత్రం అందజేశారు. పేరం సత్యం మాట్లాడుతూ గతంలో ఎన్టీఆర్ తొలి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 16 కుటుంబాల వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. కానీ వారికి అప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్క ఇళ్ల స్థలం మంజూరు చేయలేదని, ఒక్కో ఇంట్లో రెండు లేక మూడు కుటుంబాల వారు కలిసి ఉంటున్నారని, వీరు సంచార జీవనం సాగిస్తుంటారని తెలిపారు. కావున వీరికి కనుమళ్ల చెరువులో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తహశీల్దార్ రవి మాట్లాడుతూ మండలంలో ఖాళీగా ప్రభుత్వ స్థలం ఉన్న చోట మాత్రమే ఇళ్ల స్థలాలు ఇస్తారని, అర్హులకు ప్రభుత్వమే ఇళ్లుకూడా నిర్మించి ఇస్తుందని భరోసా ఇచ్చారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



నిరసనలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మికులు

సింగరాయకొండ: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్ మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని శాంతిథియేటర్ సెంటర్లో సోమవారం భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి ఏడాదైనా ఆ ఊసే లేదని ఆరోపించారు. అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.నాంచార్లు, బాబూరావు, కార్మికులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఏవో రాము

పొన్నలూరు: రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఏఓ రాము అన్నారు. మండల వ్యవసాయాధికారిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన రాము ఆశాఖ సిబ్బందితో స్థానిక రైతు సేవా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ప్రవేశపెడుతున్న పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతుల వేలిముద్రలను సకాలంలో వేయించాలన్నారు. వేలిముద్రలు వేయకపోతే పథకం వర్తించదన్నారు. సమయపాలన పాటించి సిబ్బంది సక్రమంగా పనిచేయాలన్నారు.



కొండపి నూతన ఏఓ మాల్యాద్రి

కొండపి: వ్యవసాయాధికారిగా మేడికొండ మాల్యాద్రి సోమవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా సింగరాయకొండ సాంకేతిక విభాగం వ్యవసాయ అధికారిగా పనిచేస్తూ కొండపికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న విజయ్‌కుమార్ నెల్లూరు జిల్లా ఉలవపాడుకు బదిలీ అయ్యారు. ఆయన్ను వ్యవసాయ శాఖ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నికి ఘన నివాళి



చిన్ని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు

సీఎస్‌పురం(పామూరు): కాపుసంఘం నాయకుడు, రిటైర్డ్ ఆయుర్వేద డాక్టర్ మన్నేపల్లి చిన్ని(62) అందరి మన్ననలు పొందిన వ్యక్తి అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంటరీ పరిశీలకుడు కదిరి బాబూరావు అన్నారు. సీఎస్‌పురంకు చెందిన మన్నేపల్లి చిన్ని(62) సంతాపసభ సోమవారం ఆయన నివాసంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కదిరి బాబూరావుతో పాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి, తోట అశోక్, సంగిశెట్టి పీరయ్యనాయుడు, టి.బాబూరావు పలువురు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా మురళి బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ మురళి

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి తహసీల్దార్‌గా పి.మురళి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొండపి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న బి.జనార్దన్ బదిలీపై మద్రిపూడి వెళ్లారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో మేలు



ఆహార ఉత్పత్తులు విక్రయిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొండపి: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఆ విభాగం సిబ్బంది రంజిత్, మందాకిని, మాధవ అన్నారు. కొండపి మండల కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్ లో మండలంలో ఇలవర, కట్టావారిపాలెం,పెరిదేపి యూనిట్ లలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు,పండ్లు తీసుకుని వచ్చి ప్రజలకు అందుబాటులో ఉంచారు. అనంతరం వ్యవసాయధికారిగా బాధ్యతలు స్వీకరించిన మాల్యాద్రిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఐసీఆర్పీలు జోత్స్న, మాలకొండయ్య, గౌతమి విజయలక్ష్మి, ఏడుకొండలు, ఎస్‌జీహెచ్ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలీల ఆకలి కేకలు పట్టని ప్రభుత్వాలు



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

కనిగిరిరూరల్: ఉపాధి కూలీల ఆకలి కేకలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. మండలంలోని ఏరువారిపల్లిలో ఉపాధిహామీ పథకం కూలీలతో మాట్లాడారు. మూడు నెలలు చేసిన పనులకు డబ్బులు ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు కూలీలు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు, సర్పంచ్ దమ్ము వెంకటయ్య, టి.ఆదయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక సుందరయ్య భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని, 14 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. బడుగు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పందిటి మోహన్, రాయళ్ల మాలకొండయ్య, రాజశేఖర్, దమ్ము వెంకటేశ్వర్లు, బషీరా, బి జనార్దన్, రాములు, పి. కోటేశ్వరరావు, సాయి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



క్షతగాత్రున్ని 108లో తరలిస్తున్న దృశ్యం

టంగుటూరు: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని వల్లూరు గ్రామ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జరుగుమల్లి మండలం సాదువారిపాలెం గ్రామానికి చెందిన కాకర్లమూడి మాధవరావు స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై ఒంగోలు వెళుతుండగా వల్లూరు పేస్ కాలేజీ సమీపంలో జాతీయ రహదారిపై వచ్చే సరికి వెనుక నుంచి కారు అతివేగంగా ద్విచక్రవాహనదారుడిని ఢీకొనగా మాధవరావు కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఒంగోలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగమల్లీశ్వరరావు తెలిపారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి



పీసీపల్లి: రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి రంగకృష్ణ

పీసీపల్లి: రైతులు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి రంగకృష్ణ షన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా కలిసి నివృత్తి చేసుకోవాలన్నారు.

పామూరు: మండలకేంద్రమైన పామూరు 3వ సచివాలయంలో సోమవారం అన్నదాత సుఖీభవ పథకంకు సంబంధించి రైతుల రికార్డుల పరిశీలన, ఈకేవైసీ ప్రక్రియను ఏఓ తాతపూడి అబ్రహంలింకన్ పరిశీలించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఈకేవైసీ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని వీఏఏలకు సూచించారు.

పశువైద్యాధికారిగా శివరామకృష్ణ బాధ్యతల స్వీకరణ

పొన్నలూరు: మండల పశువైద్యాధికారిగా డాక్టర్ శివరామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చౌటపాలెం పశువైద్యశాల్లో పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా పొన్నలూరు పశువైద్యశాలకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుపోషకులకు, రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తానన్నారు.

జీవోతో సచివాలయ ఉద్యోగులకు ఇక్కట్లు



సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులు

కందుకూరు: ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది బదిలీలకు సంబంధించిన జారీ చేసిన జీవో వలన వార్డు సచివాలయ సిబ్బంది తీవ్ర ఆందోళన చెందుతున్నామని కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వార్డు సచివాలయ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ తిరుమాణి శ్రీపూజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది బదిలీలకు సంబంధించి ఇటీవల ఓ జీవోను విడుదల చేసింది. ఈ జీవో ప్రకారం ఐదు సంవత్సరాల ఒక సచివాలయంలో ఉద్యోగం చేసిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉంది. అలాగే జీవో నిబంధనల ప్రకారం ఉద్యోగి సొంత మండలంకు బదిలీ చేయకూడదు. దీని ప్రకారం ప్రస్తుతం కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇతర మున్సిపాలిటీలకు బదిలీ చేయాల్సి వస్తుంది. దీంతో దాదాపు 100 కిలోమీటర్ల మేర దూరం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దీని వల్ల తక్కువ జీతంతో చేసే తమకు అటు ఆర్థికంగా, ఇటు మానసికంగాను ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉందన్నారు. కావున తమను మున్సిపాలిటీ పరిధిలోనే ఇతర సచివాలయాలకు అంటే అంతర్గత బదిలీ చేసే విధంగా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరారు.

నేటి నుంచి పొలం పిలుస్తోంది

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలో ఈనెల 17వ తేదీ నుంచి పొలం పిలుస్తోంది నిర్వహించనున్నట్లు ఏఓ ఐ కాశీవిశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు రైతు సేవా కేంద్రాల పరిధిలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కందుకూరు డివిజన్
90102 24456
Office mail : sakshiongads@gmail.com